# పచ్చనోటు

*

## రావినూతల సువర్ణాకన్నన్

వాన... వాన... రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఒకటే వాన.

చినుకుతో ప్రారంభమైన వాన తీవ్రరూపం దాల్చి కుంభవృష్టిగా మారింది. దానికి తోడు గాలి కూడా మొదలయి వాతావరణాన్ని మరింత భయంకరంగా మార్చింది. వీధు లన్నీ జలాశయాలయ్యాయి.






ఆ వానలో ఓ చిన్న పెంకుటిల్లు దీనంగా నిల్చుని ఉంది. ఆ ఇంట్లోని ఓ భాగంలో ముగ్గురు వ్యక్తులున్నా నిర్మానుష్యంగా ఉన్నట్టుందక్కడ.

ఆ ఇంటి యజమాని రాఘవ ఆకలిగొన్న సింహంలా విసురుగా పచార్లు చేస్తున్నాడు. అతని భార్య వైదేహి పాత నులక మంచంలో శవాకారంలా పడుంది. వారి సంతానం అయిన పాప కిటికీలో కూర్చుని కురిసే వానని చూస్తోంది.

రాఘవ ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఒకప్పుడతను రామచంద్రుడే అయినా ప్రస్తుతం మాత్రం సకల దుర్గుణాభిరాముడు.

అతనికి మధువు, మగువలు రెండు కళ్లు. ఏది లేకపోయినా అతనికి రోజు గడవదు.

అయితే అతనికి ఖరీదైనవే కావాలన్న పట్టింపు లేదు. సీమసారా దగ్గర్నించీ నాటుసారా దాకా, స్టార్ హోటల్లో లభించే ఖరీదైన అమ్మాయిల దగ్గర్నించీ, మెరక వీధుల్లో అతి చౌకగా దొరికే అంగడి బొమ్మల దాకా ఎవరైనా పర్లేదు. ప్రతిరోజూ ఆ రెండు చుక్కలూ మాత్రం కావాలి.

కానీ ఈ గాలి వాన మూలంగా నలభై ఎనిమిది గంటలుగా ఆ చుక్కలతనికి లభించలేదు. అందుకే అతనంత అసహనంగా పచార్లు చేస్తున్నాడు.

వైదేహికి రెండు మూడు రోజులుగా జ్వరం. ముందు ఏవో గచ్చాకు పుచ్చాకు మందులు వేసుకుంది. గానీ గుణం కనిపించలేదు. భర్తకి చెప్పినా పట్టించుకోలేదు. నిస్సహాయంగా పడుండి పోయింది.

రాత్రినించీ మరింత క్షీణించిపోయింది. భర్తని మందులకి డబ్బడగాలని ఉన్నా అంతకు ముందు అడిగి తిట్లు తినడం మూలంగా ధైర్యం చెయ్యలేకపోతోంది.

రాఘవ పచార్లు ఆపి వాచ్ చూసుకున్నాడు. తర్వాత ఏదో నిర్ణయించుకున్నట్టు తల పంకించి చెప్పులు తొడుక్కున్నాడు.

నీరసంగా కళ్లు తెరిచిన వైదేహి, భర్త వెళ్లిపోతున్నాడని గ్రహించి, దీనంగా అతన్ని పిల్చింది.

అతను తిరిగి చూశాడు.

"మందులు తెప్పించుకోవాలి! డబ్బేమైనా ఉంటే ఇచ్చి వెళ్లండి" నీరసంగా అంది వైదేహి.

అతని మొహం కఠినంగా అయిపోయింది.

"ఇంతటి దానికి మందేం అక్కర్లేదు. కాస్త మిరియాల కషాయం తాగు. అదే పోతుంది" అన్నాడు నిర్లక్ష్యంగా.

"అది కాదండీ... హాస్పటల్లో డాక్టర్..."

"నన్ను డబ్బడగద్దని ఇప్పటికి పదిసార్లు చెప్పాను. సిగ్గులేదు, ఛ! వెధవ కొంప!" అంటూ పెద్దగా అరిచి కురిసే వానలో విసురుగా వెళ్లిపోయాడు.

నిస్సహాయంగా చూస్తూండిపోయిందామె. ఆమెకి పుట్టెడు దుఃఖం వచ్చేసింది.

రాఘవ బైటికెళ్లడం గమనించిన పక్క పోర్షన్ ఆండాళమ్మ ఒక్క అంగలో ఆమె దగ్గరికొచ్చి పడింది.

నీరసంగా కళ్లు తుడుచుకుంది వైదేహి.

"ఛ! నీ మొగుడెంత దుర్మార్గుడమ్మా. పుట్టెడు జ్వరంతో పడి గొడ్డులా మూలుగుతున్న నిన్ను పట్టించుకోకపోగా మందులకి డబ్బడిగితే, ఇవ్వను పొమ్మంటాడా. ఈ పరిస్థితిలో ఆ మెరక వీధుల్ని ఉద్ధరించడానికి వెళ్లాడా" కసిగా అంది ఆండాళమ్మ.

ఆమెకి తెలుసు ఆ ఇంటి చరిత్రం.

పేలగా నవ్వింది వైదేహి.

"ఈ సమయంలో కూడా నీకు నవ్వెలా వస్తోందమ్మా!" చిరాగ్గా అంది ఆండాళ్లు.

వైదేహి అంటే ఆమెకి చాలా అభిమానం. తనే గవర్నమెంట్ హాస్పటల్కి తీసికెళ్లి చూపించిందామెని. కానీ మందులు కొనడానికి ఆమె దగ్గర కూడా డబ్బుల్లేవు.

"ఇప్పుడు ఇంత వానలో తడుస్తూ నీ మొగుడు ఎక్కడికెళ్లాడో తెలుసా? ఆ మినర్వా థియేటర్ దగ్గరికి! నీకు మందులకివ్వడానికి కుదరదన్న అతగాడు అక్కడి అమ్మాయిలడిగితే వందలు కుమ్మరిస్తాడు. ఛీ! ఇలాంటి పశువుల్ని బతికుండగానే తన్ని పాతెయ్యాలి" ఆవేశంగా అంది.

కళ్లనీళ్లు పెట్టుకోవడం తప్ప ఏం చెయ్యలేక పోయింది వైదేహి.

ఆ ఏడుపు ఆండాళ్లమ్మని మరింత చికాకు పెట్టింది.

"అదీ! ఆ బేలతనమే అతనికి మరింత తెగింపునిచ్చింది" అంటూ రాఘవని, అతని పనుల్ని ఏకరువు పెట్టి తిట్టింది. తర్వాత జాలితో వైదేహికింత కాఫీ కలిపిచ్చింది. పాపచేత అన్నం తినిపించింది.

ఆ తర్వాత ఏదైనా అవసరం అయితే పిలవమని చెప్పి వెళ్లిపోయింది.

ఆ రాత్రి రాఘవ ఇల్లు చేరలేదు. వైదేహి పరిస్థితి మరింత విషమించింది. తల్లి మూలుగు వింటూ నిస్సహాయంగా ఉండిపోయింది పాప.

+ + + +

సాయంత్రం ఏడున్నరయింది. వాన కాస్త తెరిపిచ్చినా రోడ్లన్నీ జలమయంగానే ఉన్నాయి.

రాఘవ తరచూ వెళ్లే మినర్వా థియేటర్ రోడ్ సందడిగా ఉంది.

సినిమా జనం తగ్గినా, అక్కడున్న అమ్మాయిల సందడి తగ్గలేదు.

ఆ వీధి వారకాంతలకి ప్రసిద్ధి. ప్రతి గుమ్మం ముందు అమ్మాయిలు నిల్చుని విటుల్ని రకరకాలుగా ఆకర్షించి ఆహ్వానిస్తుంటారు.

అక్కడున్న పెద్ద పూల షాపుకున్నంత డిమేండ్ ఇంకే షాపుకీ ఉండదు.

హఠాత్తుగా ఆకాశం గర్జించింది.

బైట నిల్చుని లయవిన్యాసాలు పోతున్న ఓ యువతి, అటుగా వెళ్తున్న ఒకతన్ని చప్పట్లు కొట్టి పిల్చింది. అతగాడు వెకిలిగా నవ్వుతూ వచ్చాడామె దగ్గరికి.

ఆమె సిగ్గు నటించింది. పైట సవరించుకునే నెపంతో కిందికి జార్చింది. తర్వాత అతని చెయ్యి పట్టుకుని -

"వంద రూపాయలున్నాయా?" అంది గుసగుసగా.

"ఊఁ" అన్నాడతను.

"మరింక ఆలస్యం ఎందుకు" అంటూ అతన్ని హత్తుకుంటూ ఓ ఇంట్లోకి తీసికెళ్లింది.

మరో నడివయస్కురాలు చీప్ చీప్ వేషాలు వేస్తూ ఓ కుర్రాణ్ని తీసుకుపోయింది.

ఆడవాళ్లంతా తల్లో తట్టెడు పూలున్నట్టు పూలు పెట్టుకున్నారు.

ఇలా చాలా మంది ఇళ్లలోకెళ్లి తలుపులు మూసుకున్నారు.

మళ్లీ సన్న తుంపర మొదలయింది.

అంతదాకా ఓ పక్కగా నిల్చుని పరిసరాల్ని పరికిస్తున్న శైలజ వానపడ్డంతో తుళ్లిపడింది.

పూలషాపులో కూర్చుని బేరం చూసుకుంటున్న పాతికేళ్లయువకుడు ఆమెను గమనిస్తూనే ఉన్నాడు. హడావిడి తగ్గాక పరిశీలనగా చూశాడామెకేసి.

ముచ్చటగొలిపే రూపం! నల్లని ముంగురులు తెల్లని ఆమె నుదుటి మీద పడి వింత అందాన్ని వెదజల్లుతున్నాయి. విశాల నేత్రాల్లో ఏదో బెరుకు! ఎర్రని చిన్న పెదవులు ఎందుకో కంపిస్తున్నాయి. ఈ పరిసరాలు కొత్త అని రెపరెపలాడే ఆమె కళ్లే చెప్తున్నాయి.

బట్టలు సగం తడిసి పోయాయి. పైట బురద నీళ్లలో జీరాడుతున్నా ఆమె పట్టించుకోవడంలేదు. పరిసరాలని పరికించడంలో పడిపోయిందామె. అంతేకాదు ఆమె కళ్లు ఆతృతగా ఎవరి ఆగమనం కోసమో ఎదురుచూస్తున్నాయి.

వాన పెరిగింది.

తప్పనిసరిగా కదిలి పూలషాపుకేసి నడిచిందామె. నీళ్లోడుతున్న పైటని పిండుకుని తలెత్తి చూసిన ఆమె తుళ్లి పడింది.

కారణం షాపులోని యువకుడు ఆమెనే కన్నార్పకుండా చూస్తున్నాడు.

ఆమె కంగారు పడిపోయింది. తలదించుకుంది. రెండు నిమిషాల తర్వాత ఓసారి రోడ్డుకేసి చూసి, అప్రయత్నంగా ఆ యువకుడికేసి చూసింది.

ఈసారి అతను చిన్నగా నవ్వాడు.

ఆమె కూడా నవ్వింది. అతనికేసీ, పూలకేసీ మార్చి మార్చి చూసింది.

"పూలు కావాలా?" అన్నాడతను మృదువుగా.

"ఊఁహుఁ" అందామె బెరుగ్గా.


"పర్లేదు తీసుకో!"


"నా... నా దగ్గర డబ్బుల్లేవు!"

"డబ్బొద్దులే" నవ్వాడతను.

"ఏవిఁటి?"

"నాకు డబ్బివ్వక్కర్లేదు. నీక్కావల్సినన్ని పూలిస్తాను. మరి నాక్కావల్సింది నువ్విస్తావా?" నవ్వుతూ అన్నాడతను.






"ఏం కావాలి?" అనుమానంగా అందామె.

"ఓ చిన్న ముద్దు!"

"ఛ!" అప్రయత్నంగా అందామె.

"ఏం సిగ్గా!"

"....."

"పోనీ నువ్వు పెట్టద్దులే. నేన్నిన్ను ఒక్క ముద్దు పెట్టుకోనా?" అన్నాడతను.

ఆమె చెంపలు ఎర్రబడ్డాయెందుకో. అతను స్నేహపూర్వకంగా నవ్వి రెండు మూరల పూమాల తెచ్చి స్వయంగా ఆమె తల్లో పెట్టాడు. తర్వాత ఆమె పూరేకుల్లాంటి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె కళ్లు వాలిపోయా యో క్షణం. తర్వాత రోడ్డుకేసి చూశాయి.

అతను ఆమెని పొదవి పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు.

వాన మరింత పెరిగింది.

శైలజ బట్టలు పూర్తిగా తడిసిపోయాయి.

"తడిసి పోతున్నావ్. లోపలికిరా" అన్నాడతను.

ఆమె కదల్లేదు.

రోడ్డుకేసి ఆశగా, ఆతృతగా చూస్తూనే ఉంది. రోడ్డంతా నిర్మానుష్యంగా అయిపోయింది.

ఆమె కళ్లల్లో నిరాశ పేరుకుపోయింది. "ఎవరి కోసం ఎదురు చూస్తున్నావ్! ఎవరైనా రావాలా! నినిక్కడ వెయిట్ చెయ్యమని చెప్పారా? అడిగాడు యువకుడు ఆమె ఏదో అనబోయింది.

అప్పుడే అటుగా ఓ స్కూటర్ వచ్చింది. ఆ స్కూటర్ మీదున్న వ్యక్తిని చూడగానే శైలజ కళ్లు తళుక్కుమన్నాయి. గబగబా పైట సరిచేసుకుంది. పూలు సవరించుకుంది.పూల యువకుడికేసి చూసి చిన్నగా నవ్వి చెయ్యూపి కాస్త ఇవతలి కొచ్చింది.

అయితే ఆ స్కూటర్‌మీద వచ్చిన రాఘవ ఆమె ఆశించినట్టు ఆమెకేసి చూల్లేదు. అతని కళ్లు వారకాంత కోసం పరికిస్తున్నాయి. ఎవరూ కనిపించకపోవడంతో అతని మొహంలో చిరాకు చోటు చేసుకుంది.

అతని చిరాకు గమనించని శైలజ చప్పట్లు కొట్టింది. ఆమెను దాటి పోతున్న అతను తిరిగి చూశాడు. ఠక్కున ఆగిపోయింది స్కూటర్. మరో సారి చప్పట్లు కొట్టి పిల్చిందామె. అంతే! ప్రతిమలా అయిపోయాడతను.

రమ్మన్నట్టు చేత్తో సైగ చేసిందామె. అతను స్కూటర్ పార్కు చేసి ఆమె దగ్గరికొచ్చాడు.

ఆమె పైట సర్దుకొని ఓరగా చూసింది. సిగ్గు పడింది. పూలు తడిమి చూసుకుంది.

అతని కళ్లు ఎర్రబడ్డాయి. ఆమె జబ్బ గుచ్చి పట్టుకున్నాడు. ఆమె చెయ్యిచాచి "వంద రూపాయలు!" అంది మెల్లగా. అంతే! ఆమె చెంప పేలి పోయింది. అతను కొట్టిన దెబ్బకి ఆమె వెళ్లి అల్లంత దూరాన పడింది. అప్పుడే ఓ ఘోరం జరిగిపోయింది.

ఆమె పడీపడగానే ఓ కారొచ్చి ఆమె మీదుగా వెళ్లి పదిగజాల దూరంలో ఆగిపోయింది.

కెవ్వుమంది శైలజ.

నెత్తుటి మడుగులో కొట్టుకుంటున్న ఆమె దగ్గరికి పరిగెత్తాడు రాఘవ. ఆమెమీద పడి బావురుమన్నాడు.

"నాన్నా" మెల్లగా అందామె.

"ఏవిటమ్మా ఇదంతా?" అన్నాడతను ఆమెని గుండెలకి హత్తుకుంటూ.

"అమ్మకి జొరం ఎక్కువయిందిగా నాన్నా! మందువెయ్యకపోతే గోపీ వాళ్లమ్మలా చచ్చి పోతుం దట! అమ్మలేకపోతే బతకలేనునాన్నా!" బావురు మంది శైలజ నామధేయురాలైన ఆరేళ్ల పాప.

"నా తల్లీ! ఇలా చేశావేవిటమ్మా?" తల బాదుకున్నాడతను.

"అమ్మకోసం చేశాన్నాన్నా! ఎన్నిసార్లడిగినా నువ్వు డబ్బివ్వలేదు కదా. ఇక్కడ ఏ అమ్మాయ డిగినా మాట్లాడకుండా డబ్బిచ్చేస్తారని పక్కింటి ఆండాళ్లత్తే అంటుంటే విని ఇలా వచ్చాను. ఇక్కడి వాళ్లు చేసినట్టే అన్నీ చేశాను. పైట సర్దుకున్నాను. అన్నట్లు నాన్నా! నీ పాతలుంగే పైటగా వేసుకు న్నాను. బావుంది కదూ? కానీ నాన్నా ఇలా పైటలు సర్దుకుని డబ్బడిగితే వాళ్లందరికీ డబ్బిచ్చారు మరి నేనూ అలా అడిగాను కదా మరి నువ్వెందుకివ్వలేదు నాన్నా.." ఆయాసపడిపోతూ అడిగింది పాప.

"అమ్మా...!" అతను ఆడదానిలా కుళ్లి కుళ్లి ఏడ్చాడు. పాపని హాస్పిటల్‌కి తీసుకెళ్లాలన్న ఆలోచన కూడా రాలేదతనికి

నలుగురూ చేరారు.

"హాస్పిటల్‌కి తీసికెళ్లండి."

"కారు డ్రైవర్ని అరెస్ట్ చెయ్యండి."

"ముందు పోలీసుల్ని పిలవండి" ఇలా ఎవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడుతున్నారు.

"పాపా!" అంటూ వచ్చాడు పూల యువకుడు. అతనికి ఆత్మీయులు పోతున్నంత దుఃఖం వచ్చింది.

"బంగారుతల్లీ! ఇక్కడికెందుకొచ్చావమ్మా!.... నిన్ను చూస్తుంటే ఏనాడో పోయిన నా చెల్లెలు గుర్తొస్తోందమ్మా! ఆ అల్లా దయవల్ల నీకేం కాకూ డదు." ఏడుస్తూ ఆమెదగ్గర కూలబడ్డాడు. ఆ పిల్లని రాఘవ తొయ్యడం ఎవరూ గమనించలేదు. తేరుకున్న రాఘవ కూతుర్ని భుజాన వేసుకో బోయాడు.

"నాన్నా" అంది పాప లోగొంతుతో.

"చెప్పు తల్లీ!" దుఃఖాన్ని అతి ప్రయాసగా తొక్కి పెడుతూ అన్నాడు రాఘవ.

ఆమె చెయ్యి చాచి -

"వందరూపాయలివ్వవూ?" అంది క్షీణిస్తున్న స్వరంతో. ఆమె ఆఖరి దశలో ఉందని అర్థమై పోయింది అందరికీ. అతను వెక్కివెక్కి ఏడవ సాగాడు.

"నాన్నా... డబ్బు" మళ్లీ అందామె.

ఆమె కళ్లు మూతలు పడిపోతున్నాయి.

అతను జేబులోంచి వందనోటు తీసి చాచిన ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె కళ్లు తళుక్కుమని ఆరిపోయాయి.

కాలం స్తంభించినట్టయిందతనికి.

జరిగిన దారుణాన్ని చూడలేనట్టు ఆకాశం భయంకరంగా గర్జించింది. ముక్కు పచ్చలారని పసిదాని మరణాన్ని భరించలేని మేఘాలు భోరువున్నాయి. కుండపోతగా పడుతున్న వాననీరు పాప రక్తంతో కలిసి పల్లానికి పరుగులు తీస్తోంది.

మూసిన చిన్నారి పాప పిడికిట్లోని పచ్చనోటు తడిసి ముద్దలా ఉండిపోయింది.

●